# ఆటో డ్రైవర్లకు రూ.15వేలు జీవనభృతి ఇవ్వాలి

- బీఆర్‌టీయూ రాష్ట్ర, జిల్లా నాయకులు
- ఆటో డ్రైవర్ల నిరసన ర్యాలీలు
- ఆర్డీఓకు వినతిపత్రం అందజేత

మిర్యాలగూడ, డిసెంబర్ 16: ఆటో డ్రైవర్లకు రూ.15వేలు జీవన భృతి ఇవ్వాలని బీఆర్‌టీయూ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ వాజిద్, జిల్లా అధ్యక్షుడు మహమ్మద్ నాజర్‌అలీ మీర్జా డిమాండ్ చేశారు. శనివారం పట్టణంలో ఆటో డ్రైవర్లు తమ సమస్యలు పరిష్కరించాలంటూ ర్యాలీ నిర్వహించి ఆర్డీఓ చెన్నయ్యకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆటో డ్రైవర్లు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వ అనాలోచిత విధానాలతో తమ బతుకులు రోడ్డున పడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర విధానాలతో ఆటో, క్యాబ్ డ్రైవర్లు ఆత్మహత్యలే శరణ్యంగా మారిందని వాపోయారు. ఇప్పటికైనా ప్రభుత్వం పునరాలోచించి మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం పథకాన్ని తీసివేయాలని కోరారు. ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం కల్పించడం వల్ల ఆటో డ్రైవర్లు తమ ఉపాధిని కోల్పోతున్నారని, వారి సమస్యలు పరిష్కరించాలని అన్నారు. మహమ్మద్ పర్వేజ్, జహం గీర్, మీరా అజీముద్దీన్, హనుమయ్య, మహేశ్, శ్రీను, మౌలాలిషేక్ పాల్గొన్నారు.

### వందలాది కుటుంబాలు వీధిన పడ్డాయి

నార్కట్‌పల్లి: కాంగ్రెస్ ప్రభుత్వం మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత సౌకర్యం తీసుకురావడంతో ఆటో డ్రైవర్ల వందలాది కుటుంబాలు వీధిన పడ్డాయని వారు నిరసన వ్యక్తం చేశారు. శనివారం మండల కేంద్రంలోని ఆర్టీసీ డిపో ముందు ప్రభుత్వ తీరుకు నిరసనగా ఆటో డ్రైవర్లు రాస్తారోకో చేశారు. ఈ సందర్భంగా మండల ఆటో యూనియన్ అధ్యక్షులు బింగి జాని మాట్లాడుతూ ప్రజా సంక్షేమ పాలన అందించాల్సిన ప్రభుత్వాలు ఆటో డ్రైవర్ల పొట్టకొడుతూ ఇబ్బందులకు గురి చేస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో వాకాటి యాదయ్య, దండు ఎల్లయ్య, ఆదిమల్ల రాములు, పరమేషం, వీరాంజనేయులు, సత్యనారాయణ, మదు, శంకర్, వెంకన్న, గోపి, గణేష్, రాజీవ్‌గాంది, వెంకట్‌రెడ్డి, చిరంజీవి, మహేశ్ పాల్గొన్నారు.



నార్కట్‌పల్లిలో బస్ డిపో ముందు ధర్నా చేస్తున్న ఆటో డ్రైవర్లు

# మరో 24 కొత్త పంచాయతీలు

(మొదటి పేజీ తరువాయి)

గ్రామ పంచాయతీల్లోనూ ఎన్నికల నిర్వహణ కోసం వివరాలను సేకరిస్తున్నారు. జిల్లా పంచాయతీ అధికారులు ఈ వివరాలను రాష్ట్ర ఎన్నికల సంఘానికి అందజేసినట్లు తెలిసింది. ఈ వివరాల ప్రకారం జిల్లాలో మొత్తం 24 నూతన గ్రామ పంచాయతీల్లోనూ ఎన్నికలు జరుగనున్నాయి. చందంపేట మండలంలో బండమీదితండా, నల్లచెలమొల్ల, చింతపల్లి మండలంలో అనాజీపురం, బాలాజీ తండా, దేవరకొండ మండలంలో గొల్లపల్లి, గిరిజనగర్‌తండా, డిండి మండలంలో కటికబండతండా, కొండమల్లేపల్లిలో పకీరుపురం, నేరడుగొమ్ము మండలంలో సుద్దబావితండా, జోడుబావితండా, పీఏపల్లి మండలంలో పోతిరెడ్డిపల్లి, సింగరాజుపల్లి, రంగారెడ్డిగూడెం, మాదారిగూడెం, గడ్డమీదితండా, పిల్లిగుండ్లతండా, మునుగోడు మండలంలో బీరెల్లిగూడెం, కాశవారిగూడెం, అనుముల మండలంలో కుపాస్‌పల్లి, కాశివారిగూడెం, గుర్రంపోడు మండలంలో కట్టవారిగూడెం, పెద్దవూర మండలంలో పుల్యాతండా, సంగారం, తిరుమలగిరిసాగర్ మండలంలోని చెంచువాని తండాలు నూతన గ్రామ పంచాయతీలుగా ఏర్పాటు కానున్నాయి. రానున్న పంచాయతీ ఎన్నికల అనంతరం ఈ గ్రామాల్లో నూతన పాలక వర్గాల ఆధ్వర్యంలో పాలన వ్యవహారాలు కొనసాగనున్నాయి.



సైబర్ నేరాల దర్యాప్తుపై అవగాహన కల్పిస్తున్న డీఎస్పీ శ్రీనివాస్‌రావు

# సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

- జిల్లా సైబర్ సెక్యూరిటీ డీఎస్పీ శ్రీనివాస్‌రావు

కోదాడ రూరల్, డిసెంబర్ 16 : సైబర్ నేరాలపై పోలీసులు అప్రమత్తంగా ఉండాలని జిల్లా సైబర్ సెక్యూరిటీ డీఎస్పీ శ్రీనివాస్‌రావు సూచించారు. పట్టణంలోని సూర్యాపేట రోడ్డులో గల కాశీనాథం ఫంక్షన్ హాల్‌లో శనివారం నిర్వహించిన కోదాడ డివిజన్ పోలీస్ అధికారుల సమావేశంలో పాల్గొని మాట్లాడారు. రాష్ట్ర సైబర్ సెక్యూరిటీ విభాగం అత్యంత పటిష్టమైన ప్రణాళిక, దర్యాప్తు సాంకేతికతను అందించిందని, దాని ప్రకారం దర్యాప్తు చేయాలని సూచించారు.సైబర్ నేరాలపై యువత, విద్యార్థులకు అవగాహన కల్పించాలన్నారు. సమావేశంలో పట్టణ, రూరల్ సీఐలు రామలింగారెడ్డి, రామకృష్ణారెడ్డి, రాము, రాఘవులు, సైబర్ సెక్యూరిటీ ఇన్‌స్పెక్టర్ రవి, డివిజన్ ఎస్ఐలు పాల్గొన్నారు.

# నిరుపయోగంగా ఎల్-4, 5 ఎత్తిపోతల పథకం



వేంపాడులోని ఎల్-4, 5 ఎత్తిపోతల పథకం



ముళ్ల పొదల నడుమ సిబ్బంది క్వార్టర్స్

- బూత్ బంగ్లాను తలపిస్తున్న సిబ్బంది క్వార్టర్స్
- చుట్టూ పెరిగిన కంప చెట్లు

నిడమనూరు, డిసెంబర్ 16 : మండలంలోని వేంపాడులో ఎల్-4, 5 ఎత్తిపోతల పథకంపై నిర్లక్ష్యపు నీడలు కమ్ముకున్నాయి. ఈ ఎత్తిపోతల సిబ్బంది కోసం నిర్మించిన క్వార్టర్స్ బూత్ బంగ్లాను తలపిస్తున్నాయి. ఎత్తిపోతల ఆవరణ ఆసాంతం కంప చెట్లతో నిండి దారి సైతం మూసుకుపోయింది. గ్రామానికి దూరంగా నాగార్జునసాగర్ ఎడమ కాల్వ వెంట నిర్మించిన ఎత్తిపోతల పథకం ద్వారా వేంపాడు, అన్నారం గ్రామాల్లోని 1840 ఎకరాలకు ఆయకట్టును స్థిరీకరించారు. అధికారులు పథకం నిర్వహణను పట్టించుకోవడం లేదు. దీంతో ఎత్తిపోతల పథకం, సిబ్బంది క్వార్టర్స్ చుట్టూ ముళ్లపొదలు పెరిగిపోయాయి. ఎత్తిపోతల పథకం ప్రదేశంలో గ్రామానికి చెందిన రైతులు గడ్డివాములు ఏర్పాటు చేసుకున్నారు. సరైన పర్యవేక్షణ లేకపోవ డంతో ఈ నెల 12వ తేదీన లిఫ్ట్‌కు చెందిన అదనపు ట్రాన్స్‌ఫార్మర్‌ను గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేశారు. అందులోని రాగి తీగ, ఆయిల్‌ను దొంగిలించారు. ఇప్పటికైనా ఎత్తిపోతల పథకం నిర్వహణ పై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని పలువురు కోరుతున్నారు.

# ఘనంగా కాటమయ్య జాతర

అనంతగిరి, డిసెంబర్ 16 : మండలంలోని ఖానాపురం గ్రామంలో కాటమయ్య జాతరను శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గౌడ కులస్తులు గ్రామంలో ఊరేగింపు నిర్వహించి తమ ఆరాధ్య దైవం కంఠ మహేశ్వర స్వామిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కౌండిన్య గౌడ సంఘ వ్యవస్థాపక అధ్యక్షుడు కేఎల్‌ఎన్ ప్రసాద్ హాజరై పూజలు చేశారు. అనంతరం మాట్లాడుతూ సంస్కృతీ, సంప్రదాయలకు తెలంగాణ నిలయమని, గౌడ కులస్తులు ఐకమత్యంగా వారి పండుగ నిర్వహించుకోవడం ఆనందంగా ఉందన్నారు. గీత కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలొ గౌడ సంఘం నాయకులు రామయ్యగౌడ్, వీరయ్యగౌడ్, నాగేశ్వర్‌రావుగౌడ్, వేలాద్రిగౌడ్ పాల్గొన్నారు.



కాటమయ్య జాతరకు హాజరైన కేఎల్‌ఎన్ ప్రసాద్

## రేపు అయ్యప్ప మహా పడిపూజ

మాల్, డిసెంబర్ 16 : చింతపల్లి మండలంలోని శబరికొండ మణికంఠ స్వామి ఆలయంలో సోమవారం అయ్యప్ప మండల, మహా పడి పూజ నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ అధ్యక్షుడు కనిగిరి గోవర్ధన్, గురుస్వాములు జగతయ్య, యాదయ్య, ఆలయ అర్చకులు ప్రవీణ్‌శర్మ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా గణపతి హోమం, గణపతి పూజ, సుబ్రహ్మణ్య స్వామి పూజ, మహా లక్ష్మిదేవి కుంకుమార్చన, అయ్యప్పకు పంచామృతాలతో అభిషేకం, సాయంత్రం రథోత్సవం ఉంటుందని పేర్కొన్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాని వారు కోరారు. పూజకు పలువురు ప్రముఖులు హాజరవుతున్నట్లు తెలిపారు.

## బీసీలకు ఉన్నత స్థాయి పోస్టుల్లో ప్రాధాన్యం ఇవ్వాలి

- బీసీ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగంగౌడ్

మిర్యాలగూడ, డిసెంబర్ 16: రాష్ట్రంలో బలహీన వర్గాల(బీసీ)కు చెందిన ఐఏఎస్ ఐపీఎస్ వంటిఒ ఉన్నత స్థాయి పోస్టుల్లో ప్రాధాన్యత ఇవ్వాలని బీసీ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగంగౌడ్ శనివారం ఒక ప్రకటనలో అన్నారు. రాష్ట్రంలో అధిక జనాభా గల బీసీలకు కాంగ్రెస్ ప్రభుత్వం న్యాయం చేయాలన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి బీసీ ఐఏఎస్‌లకు ప్రాధాన్యతగల పోస్టులతో పాటు సీఎం కార్యాలయంలో ఒక బీసీ ఐఏఎస్‌ను నియమించాలని డిమాండ్ చేశారు. ఒకే సామాజిక వర్గానికి కొమ్ముకాయకుండా బలహీన వర్గాలకు చెందిన అధికారులకు తగిన ప్రాధాన్యత ఇవ్వాలన్నారు.

## మద్యం దుకాణాన్ని

### జనావాసాలకు దూరంగా తరలించాలి

మఠంపల్లి, డిసెంబర్ 16 : మండల కేంద్రంలోని ప్రధాన రహదారిపై గృహ నివాసాల మధ్య ఉన్న మద్యం దుకాణాన్ని దూరంగా తరలించాలని దుర్గానగర్ కాలనీవాసులు మోహన్‌రెడ్డి, ఆంతోన్‌రెడ్డి, సామ్యేల్, జమీల్ కోరారు. మండల కేంద్రంలో శనివారం విలేకరులతో వారు మాట్లాడుతూ దుకాణాన్ని మరో చోటుకు తరలించాలని ఎక్సైజ్ అధికారులకు తొలుత విన్నవించినా పట్టించుకోలేదన్నారు. తమ సమస్యను వెంటనే పరిష్కరించాలని కోరారు.

## మహాద్భుతంగా గోవిందమాల మహా మండలి పూజ

బొడ్రాయిబజార్, డిసెంబర్ 16 : జిల్లా కేంద్ర ంలోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం గోవింద మాల మహా మండల పూజ మహోత్సవాన్ని నిర్వహించారు. అహోబిల రామానుజజీయర్‌స్వామి పర్యవేక్షణలో 1,001 కలశాలతో స్వామి అమ్మవార్లకు అభిషేకం జరిపారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించారు. కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకుడు నల్లాన్ చక్రవర్తుల వేణుగోపాలాచార్యులు, అర్చకులు, గోవిందమాల భక్త బృందం పాల్గొన్నారు.



యాగం వద్ద పూజలు చేస్తున్న అహోబిల రామానుజ జీయర్‌స్వామి

## గడ్డివాము దగ్ధం

- సుమారు రూ. లక్ష నష్టం

గుర్రంపోడ్, డిసెంబర్ 16: మండలంలోని తెరాటిగూడెంలో శనివారం ప్రమాదవశాత్తు గడ్డివాము దగ్ధమైంది. గ్రామానికి చెందిన శిరబోయిన సతీష్ కు చెందిన 500 కట్టల గడ్డికి నిప్పంటుకొంది. అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇవ్వగా వారు వచ్చి మంటలు ఆర్పే సరికి గడ్డి పూర్తిగా కాలిపోయింది. సుమారు లక్ష రూపాయలు నష్టం వాటిల్లిందని బాధితుడు తెలిపారు.

## కార్యకర్తలకు బీఆర్‌ఎస్ అండ

- పీఏసీఎస్ చైర్మన్ రాములుగౌడ్

మాడ్గులపల్లి, డిసెంబర్ 16: రాష్ట్రంలో బీఆర్‌ఎస్ పార్టీ కార్యకర్తలకు ఎల్లప్పుడూ అండగా ఉంటుందని పీఏసీఎస్ చైర్మన్ జెర్రిపోతుల రాములుగౌడ్ అన్నారు. శనివారం మండల కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల్లో గెలుపోటములు సహజమని అన్నారు. ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీల అమలుకు ప్రతి కార్యకర్త పోరాటం చేయాలని సూచించారు. రానున్న పంచాయతీ, పార్లమెంట్ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా కార్యకర్తలు పనిచేయాలన్నారు. బీఆర్‌ఎస్ నాయకులు కొండలు, ఎస్సీ సెల్ అధ్యక్షుడు రాంబాబు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న పీఏసీఎస్ చైర్మన్ రాములుగౌడ్